క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు



అయిజ: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని శివాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం దాతలు సమర్పించిన శివ పార్వతుల పంచలోహ విగ్రహాలకు శాస్త్రోక్తంగా, వేదమంత్రాలు జపిస్తూ పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'మమ్మల్ని ఆదుకోండి'



అయిజ: ప్రమాదవశాత్తు ఆదివారం రాత్రి మండల కేంద్రంలో తమ గుడిసెలకు నిప్పంటుకొని ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వెంకటరమణ, వెంకటమ్మ, రమేష్, రాజు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి



అయిజ: నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రాములుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్ బస్సుల్లో సీట్ల పరిమితికి మించి విద్యార్థులను కూర్చొబెడుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, పట్టణ అధ్యక్షుడు వీరేష్, పరశురాముడు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



ధరూరు: మద్యం సేవించి వాహనాలు నడపరాదని, దాని వల్ల ఎన్నో అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని ఎస్ఐ శ్రీహరి వాహనదారులను సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో డ్యాం రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

శివాలయాలు ముస్తాబు

అయిజ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక పూజల కోసం మండల వ్యాప్తంగా శివాలయాలను నిర్వాహకులు సుందరంగా అలంకరిస్తున్నారు. మండల కేంద్రంలో సీతారాములు ప్రతిష్ఠించిన గుంత రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మాణం పనులు పూర్తి చేసి ముస్తాబు చేశారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

గద్వాల క్రైం: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గద్వాల మండలం సంగాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సంగాలకు చెందిన తెలుగు పద్మ (45) కొంతకాలంగా మద్యానికి అలవాటుపడింది. అయితే మద్యం తాగొద్దని భర్త నర్సింహులు పలుమార్లు మందలించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. మంగళవారం మద్యం విషయమై ఇరువురి మధ్య మరోసారి వివాదం చోటు చేసుకుంది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పద్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

యూరియా కృత్రిమ కొరత



యూరియా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

- ఇతర మందులు కొంటేనే యూరియా ఇస్తామంటున్న ఫర్టిలైజర్ డీలర్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు

ధరూరు: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నా.. యూరియా లేదంటూ డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కేవలం యూరియా కోసం వచ్చిన రైతులకు కాకుండా.. ఇతర గట్టి మందులు కొన్న వారికే యూరియా ఇస్తున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల రైతులు, కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామాలకు చెందిన రైతులు ధరూరులో అన్ని దుకాణాల్లో యూరియా కావాలని అడిగితే లేదంటున్నారని వాపోయారు. యాసంగి వరి పంట చివరి దశలో ఉన్న తమకు ఇతర మందులు అవసరం లేదని, కేవలం యూరియా, పొటాష్ అవసరమవుతున్నాయని తెలిపారు. గట్టి మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏమైనా అడిగితే పై నుంచే కొరత ఉందని, తామేమి చేయలేం అని ఫర్టిలైజర్ షాపు వారు చెబుతున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయాధికారులు తనిఖీలు చేయకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తనిఖీలు చేసి యూరియా కృతిమ కొరత సృష్టిస్తున్న షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

యూరియా అందేలా చూడాలి



రైతులకు ప్రస్తుతం అవసరమవుతున్న యూరియా ధరూరులో ఇవ్వడం లేదు. ఇతర గట్టి మందులు అంటకట్టేందుకు డీలర్లు చూస్తున్నారు. పంట చివరి దశకు వచ్చింది. ఇప్పుడు ఆ మందులు తీసుకొని ఏం చేయాలి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి.

– రైతు వెంకట్‌రెడ్డి, పాతపాలెం

కొరత ఏం లేదు

యూరియా కొరత ఏం లేదు. ధరూరు పీఏసీఎస్, ఏర్ఎస్‌కే, గ్రోమోర్ కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంది. కావాల్సిన రైతులు అక్కడ తీసుకోవచ్చు. తమకు కూడా కొంత మంది రైతులు ఫోన్ చేశారు. వారికి ఇదే విషయం చెప్పాం. రైతులకు ఇబ్బందులు సృష్టించే డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీలత, ఏఓ, ధరూరు

'ప్రజల పక్షాన పోరాడుదాం'

అయిజ: ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుదామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకొని వారి తరుపున అధికారులు, నాయకులతో పోరాడి న్యాయంగా ప్రజలకు చేయాల్సిన పనులను చేయించాలని సూచించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామానికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త పరశురాముడిని పరామర్శించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

తిరుమలలో గుడెందొడ్డి భజనపరులు



అయిజ: మండలంలోని గుడెందొడ్డి గ్రామానికి చెందిన శ్రీ రామలింగేశ్వర భజన మండలి సభ్యులు మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆహ్వానం మేరకు తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన చేశారు. ఈసందర్భంగా స్వామి వారి కీర్తనలు ఆలపించారు. ఆలయ కమిటీ వారు భజన మండలి సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ప్రత్యేకంగా స్వామివారి దర్శనం చేయించారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మన్న, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ



ధరూరులో..

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ మంజుల, మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రవీంద్రబాబు మంగళవారం సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. విద్యార్థుల హాజరు రిజిస్టరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, కిచెన్, విద్యార్థులు ఉండే గదులను, కొత్త మెనూ ను పరిశీలించారు. పరీక్షలకు సమయం దగ్గరపడుతుండడంతో బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్ సు. దీర్‌గౌడ్ ను ఆదేశించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని వెనుకబడిన బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వసతి గృహం తనిఖీ చేశామన్నారు. వసతిగృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా మరుగుదొడ్లు, మూత్రశాలలను, స్నానపు గదులను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో హస్టల్ వార్డెన్ పుష్పలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో..

'వలసదారులకు సంకెళ్లు వేయడం సరికాదు'

వనపర్తి రూరల్: అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించారని భారతీయులకు సంకెళ్లు వేసి విమానంలో దేశానికి తరలించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్ద కేంద్ర ప్రభుత్వం నిరసన కూడా వ్యక్తం చేయలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 27 గ్రామ శాఖల సమావేశాలు ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని, సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం మార్చి 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామన్నారు. కనీసం 500 మందిని సమీకరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో చంద్రయ్య, విజయరాములు, కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, మోష, సీఎస్‌శెట్టి, రవీందర్, గోపాలకృష్ణ, కుతుబ్, హరత్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ.. సామాజిక బాధ్యత

ఎర్రవల్లి: బాలల హక్కులను కాపాడంతో పాటుగా వారిని సంరక్షించడం కోసం బాలల సంరక్షణ కమిటీలు కృషిచేయాలని సీడీపీఓ సుజాత అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయలంలో మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ హాజరై మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీ బాధ్యతలు, విధులను గురించి అవగాహన కల్పించారు. విధిగా అన్ని గ్రామాల్లో బాలల సంరక్షణ కమిటీలను సమన్వయం చేసుకోవడం మండల కమిటీ బాధ్యత అని, గ్రామ కమిటీలు ప్రణాళికలను తయారు చేసుకోవడంలో, సమస్యలపై అవగాహన పెంచడం, పరిష్కారంలో అవసరమైన శిక్షణ, తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి జోగురవి మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేకమైన హక్కులు కలిగి ఉన్నాయని, బాల్య వివాహం వల్ల వచ్చే నష్టాలు, కష్టాలతో పాటు భవిష్యత్తులో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహం జరిపిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్లకు తెలియజేయాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి బాలల సంరక్షణ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్.ఓ డాక్టర్ రాధిక, సీసీ బీచుపల్లి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పరమేశ్వరి, ఎస్.ఏ జయరాములు, ఆర్.ఐ మదన్‌మోహన్ పాల్గొన్నారు.



బాలల సంరక్షణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

శివ మాలధారుల ఇరుముడి పూజలు



గట్టు: శివదీక్షను చేపట్టిన మాలధారులు మంగళవారం గట్టులోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. ఇరుముడి ధరించిన అనంతరం శివ మాలధారులు శ్రీశైలానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భాజా బంత్రీలతో మాలధారులను సాగనంపారు.

నిరంతర వైద్యం అందేనా?

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు లేక స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో సుమారు 45 వేల మంది జనాభా ఉన్నారు. మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే రోగులకు సేవలు అందుతున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు డాక్టర్ల వద్దకు, జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. నిత్యం సుమారు 100కు పైగా రోగులు ఓపీ సేవలకు వస్తారు. సీజనల్ వ్యాధుల కాలంలో ఇది ఇంకా ఎక్కువగా ఉంటోంది.

అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు జరిగేనా..

కేతేపల్లిలో అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే మండల కేంద్రంలోని పీహెచ్‌సీపై భారం తగ్గుతుందని అధికారులు విన్నపించినా.. ఇంకా ఆ దిశగా అడుగులు పడట్లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందించేందుకు మండలంలోని రేమద్దుల, అన్నారం, చింతకుంట, మాందాపూర్, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లను నియమించారు. కానీ వారు సమయపాలన పాటించకపోవడం, మధ్యాహ్నం వరకే కేంద్రాలు మూతపడటంతో ప్రజలకు నిరాశే మిగిలింది.

సమస్యలు.. ఖాళీ పోస్టులు

పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మరొక డాక్టర్ డిప్యూటేషన్‌పై కడుకుంట్ల పీహెచ్‌సీలో, ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై కొత్తకోట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఇబ్బందులు తప్పడంలేదు. పీహెచ్‌సీలో మొదటి ఏఎన్ఎంలు 4 పోస్టులు, రెండవ ఏఎన్ఎంలు 2 పోస్టులు, స్టాఫ్ నర్సు ఒక్కరు, ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫార్మసిస్టు, సీహెచ్ఓ పోస్టులు, ఇద్దరు సూపర్‌వైజర్ల పోస్టులు, అటెండర్, స్వీపర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎంఈఓలు

గద్వాల టౌన్: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు విద్యా సామర్థ్యాలు సాధించాలని ఎంఈఓలు సూచించారు. స్థానిక బాలభవన్‌లో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ప్రతిభ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో మౌలిక విద్యా సామర్థ్యాలు సాధననే అంతిమ లక్ష్యమన్నారు. అనంతరం విద్యాసామర్థ్యాలు, చిత్రలేఖనం, నాటిక అభినయం, టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్‌గౌడ్, నల్లారెడ్డి, రవీంద్రబాబు, వెంకటేశ్వర్‌రావు, మహేష్, డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, జిల్లా విద్యా సమన్వయ అధికారిణి ఎస్తేర్‌రాణి, చైల్డ్ ప్రొటెక్షన్ టీం సభ్యుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి..

మల్దకల్: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి సంగీతలక్ష్మి కస్తూర్బాగాంధీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మల్దకల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వంటగది పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్, ఎంపీఓ రాజశేఖర్, ఎస్ఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మల్లాపురంతండా పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం వరలక్ష్మి



మల్దకల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో..

సృజనాత్మకతను వెలికితీయాలి..

కేటీదొడ్డి: విద్యార్థులతో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సబ్జెక్ట్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని హెచ్ఎం వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాపురంతండా పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్ట్‌ల వారిగా మూడో తరగతి నుంచి ఐదో తరగతి పిల్లల వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియల్‌ను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమానికి పిల్లల తల్లి దండ్రులు హాజరై, మెటీరియల్‌ను తల్లిదండ్రులు తిలకించారు.

విద్యార్థుల ప్రతిభ

గట్టు: జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ ప్రతిభ ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో మంగళవారం గట్టు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు. ఆలూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి రామచంద్ర జిల్లా స్థాయిలో పోటీల్లో ద్వితీయ బహుమతి, గట్టు ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు దయాకర్‌రెడ్డి, ధర్మతేజ గణిత క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.



గట్టు విద్యార్థులు

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

శాంతినగర్: నిరుపేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థలకు బడ్జెట్ 15 శాతం నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి దోహదపడాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మహిళా సమాఖ్య భవనంలో మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి నరసింహ, ఎంపీడీఓ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కుల కోసం బాలల పరిరక్షణవేదిక సభ్యులు కృషిచేస్తున్నారని కొనియాడారు. బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు ఉన్నాయని, ఎవరైనా ముందుకు వస్తే వెంటనే మంజూరు చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, మండల కోఆర్డినేటర్ అనిమిరెడ్డి, రజిత, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్లు సుధాకర్, శేఖర్, విక్రమసింహారెడ్డి, లక్ష్మీదేవి, నాగమ్మ, గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

అయిజ: విద్యార్థులందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రంలోని జెండర్ స్పెషలిస్ట్ సరోజ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలోని మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఉత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో విద్య, రక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల రక్షణకు అందరూ కలిసి రావాలని, పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా బాలికలను వేధింపులకు గురిచేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసచారి, పాఠశాల హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ సరోజ

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం



ధరూరు: క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ధరూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి, మయూరి పార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను క్షేత్ర స్థాయి పర్యటనకు తీసుకెళ్లడం ద్వారా వారిలో నూతన ఆలోచనలు, విజ్ఞానం పెరుగుతుందన్నారు.